# శృతిమించిన రాగం

ఉదయం పదకొండు గంటలవేళ,
రోహిణీ కార్తె ఎండ నిప్పులు చెరుగుతోంది.

గవర్నమెంటు హాస్పిటల్ గేటు దాటి బైటికొచ్చాడు శ్రీపతి.

కళ్ళకు జోడు, చేతిలో కర్ర, బట్టతలమీద అక్కడక్కడ కన్పించే తెల్లని వెంట్రుకలు... వడిలిపోయిన శరీరం... మనిషిని చూస్తూనే పోల్చుకోవచ్చు పింఛను పుచ్చుకుంటూ జీవిత చరమాంకాన్ని వెళ్ళదీస్తున్న భారత పౌరుడని.

కాళ్ళకు చెప్పులూ, నెత్తికి గొడుగూ వున్నప్పటికీ, ఎండ తన క్రౌర్యాన్ని ప్రదర్శిస్తూ, శ్రీపతిని భయపెడుతోంది.

రిక్షా ఎక్కటం అలవాటులేని శ్రీపతి కాళ్ళీడ్చుకుంటూ నడిచేందుకే సిద్ధపడ్డాడు.

ఓ పది గజాలు నడచేసరికి హాస్పిటల్ ప్రహారీగోడ పక్కగా చిత్రమైన సంఘటన కళ్ళబడ్డది.

నడుస్తున్నవాడల్లా ఠక్కున ఆగేడు.

ఫుట్ పాత్ మీద ఓ మానవాకారం... దానిమీద మాసినగుడ్డా... ఆ గుడ్డమీద చెల్లా చెదురుగా పడివున్న చిల్లర డబ్బులూ... ఆ ఆకారానికి ఇరువైపులా యిద్దరు వ్యక్తులూ...

"బాబ్బాబు!... బీదోడు...... సచ్చిపోయాడు,.. మీ సేతనైన దరమం సేయండి..." శ్రీపతిని వుద్దేశించి అన్నాడు ఆ ఇద్దరిలో ఒకడు.

శ్రీపతికి జాలేసింది.

ప్రతివ్యక్తీ, పొట్టకోసం బ్రతికి వున్నన్నాళ్ళు మాత్రమే అగచాట్లు పడ్తాడని శ్రీపతికి తెలుసు.

కానీ...ఇప్పుడో!

శవాన్ని ఆదరువు చేసుకుని అడుక్కు తింటున్న మనుష్యులు వీళ్ళు!

ప్రాణి పోయాక సైతం శవానిక్కూడా విలువ వుంది సుమా! అన్పించింది. శ్రీపతికి.

జేబులోకి చెయ్యి పోనిస్తూ "పోయిన మనిషి మీకేమవుతాడు బాబూ..." అడిగేడు శ్రీపతి.

"ఆc!...ఏమీకాదు. వీళ్ళ వ్యాపారానికి పనికొచ్చిన ఓ అనాథ ప్రేతం" అనేసి రోడ్డువెంట నడిచివెడుతున్న పెద్ద మనిషి కేసి చిత్రంగా చూశాడు శ్రీపతి.

క్షణం క్రితంవరకూ జాలిపడిన శ్రీపతి హృదయం ఆ మాటలు విన్న తర్వాత శవం దగ్గరున్న వ్యక్తులమీద అసహ్యం వేసింది.

ఎండ వేడీ... వడగాడ్పు శృతిమించింది.

జేబులోంచి తీసిన పావలా బిళ్ళ ఆ శవంమీద విసిరేయ బోయాడు.

శవం ముఖాన వున్న గుడ్డకాస్తా...హోరుగాలికి తొలిగి పోయింది.

శవాన్ని పరీక్షగా చూడనారంభించేడు శ్రీపతి.

"ఏటండీ... అట్టా సూత్తూండారు? దరమం సేత్తే సెయ్యండి... లేకుంటే ఎల్లిపొండి. మద్దిన మీ శవపరీచ్చ ఏందంటా" ఆ ఇద్దరిలో ఒకడు విసుక్కున్నాడు.

అప్పటి వరకూ నిల్చున్న వాడల్లా మునిగాళ్ళమీద కూర్చుంటూ "మీకూ ఈ శవానికీ ఏమిటీ సంబంధం? రెట్టించి అడిగేడు శ్రీపతి.

"ఈడు బతికుండగా ఏదో వుండేది సంబంధం... సచ్చిండూ... బందం తెగిపోనాది..." నిర్లక్ష్యంగా అన్నాడు మరొకడు.

దోవన నడిచివెళ్తున్న వారిని పీడిస్తూనే వున్నాడు రెండోవాడు.

శ్రీపతి ఆలోచన్లు గతాన్ని గుర్తు చేసుకుంటున్నాయ్.

"దౌర్భాగ్యుల్లారా? ... ఈ శవానికి మీకూ ఏమీ సంబంధం లేదుకదూ?" నొక్కి మళ్ళీ అన్నాడు.

"నిజమే! మరి నీకేమైనా సుట్టమా?" ఇద్దరూ ముక్త కంఠంతో అన్నారు.

"అవున్రా। వీడు నాకు కావలసినవాడే! అంతకుమించిన ఆప్తుడు. చివరికి దుర్దశ పట్టింది..." కళ్ళొత్తుకున్నాడు. ఆ మనిషి ఎవరైందీ ఆనవాలు పట్టగలిగిన శ్రీపతి.

"నామాట వినండి... మీకు కావలసింది డబ్బేగా! అదేదో నేనే యిస్తాను. ఈ శవాన్ని నాకిచ్చేయండి."

పాతిక రూపాయలు పుచ్చుకొని వెళ్ళిపోయారిద్దరూ—

ఎద్దులబండి మాట్లాడిన శ్రీపతి... ఆ భౌతికకాయాన్ని స్మశానంవేపు దారితీయించాడు.

*   *   *

తడి బట్టలతో కాళ్ళీడ్చుకుంటూ శ్రీపతి ఇల్లు చేరుకునే సరికి రెండు గంటలు దాటింది.

"ఆస్పత్రికని వెళ్ళినవారు ఇప్పుడా ఇల్లు చేరుకోవటం... అయ్యో! ఈ తడిబట్టలేమిటండీ?" వాకిటోనే ఎదురైన కామేశ్వరమ్మ దీర్ఘాలు తీస్తూ అడిగింది.

"నువ్వాక్కడే వుండు; నేను దొడ్లో బావి దగ్గరకెళ్ళి స్నానం చేసి వస్తాను. ఇంతలో నువ్వు పొడిబట్టలు పట్రా..." నీరసించిన కంఠంతో బదులుపలికి దొడ్లోకి దారి తీశాడు.

తలస్నానం చేశాక, బట్టలుమార్చుకుని ఇంట్లోకొచ్చాడు.

"అసలేం జరిగిందండీ! ఈవయసులో వేళతప్పి స్నానం చేయటమేమిటి? లేవండీ భోజనం చేద్దురుగానీ... అసలే వేళ మించిపోయింది..."

నాకు తినాలనిలేదు కాముడూ!... సీతాపతి యాత్ర ముగిసింది — ఇక నేను మిగిలాను..." అనేసి, పంచపాళీలో వున్న వాలుకుర్చీలో నడుము వాల్చేడు.

శ్రీపతి ఆలోచనల్లు పూర్వదిగంతాలకు దొర్లిపోయినయ్.

*　　　*　　　*

"అడ్డమైన వాళ్ళూ వచ్చి భోజనాలు చేసి వెళ్ళేందుకు ఇదేం ధర్మసత్రంకాదు!...అంత కావాలనుకుంటే.. హోటల్లో పెట్టించమను అమ్మాయ్! మీఆయనతో చెప్పు... హు! అల్లుడితోపాటు గిల్లుడనీ...వచ్చేపోయేవారికి విందులూ విలాసాలూ అనిపెట్టుకుంటే, ఇక మనం బాగుపడ్డట్టే?" సుభద్రమ్మ మాటల్లో కాఠిన్యం ధ్వనించింది.

డైనింగ్‌హాల్లో భోజనంచేస్తున్న సీతాపతి హృదయంలో అత్తగారన్న మాటలు సూదుల్లా గుచ్చుకున్నాయ్. ఎదురుగా వున్న శ్రీపతి ముఖంలోకి చూశాడు.

స్నేహితుడి ఎదుట తాను అవమానం పొందాల్సి వచ్చినందుకు, సిగ్గుతో, అభిమానంతో, సీతాపతి కుంచించుకు పోవటం గమనించలేదు శ్రీపతి.

పళ్ళెంలోవున్న అన్నాన్ని మునివేళ్ళతో కెలుకుతున్నా డన్న మాటేగానీ తినాలన్పించటం లేదు సీతాపతికి.

అత్తగారి సాధింపు మాటలకు వళ్ళుమండటమే కాదు... కడుపుకూడా నిండిపోయింది.

కూర్చున్న వాడల్లా లేవబోయాడు.

"నువ్వు తొందరపడితే నామీద ఒట్టే! — తర్వాత నీ ఇష్టం! ! —" శ్రీపతి కళ్ళతోనే హెచ్చరించాడు.

ఆ రోజంతా సీతాపతి ఆలోచిస్తూనే వున్నాడు.

*          *          *          *

ఆ రోజు ఫస్టు తారీకు!

సునీత పుట్టిన రోజుకూడా! !

ఆఫీసు నుంచి వస్తూ కొట్టుకెళ్ళి వాయిలుచీరె కొనుక్కొ-చ్చాడు సీతాపతి.

''పోన్లెండి. ఈ రోజైనా పెందలాడే ఇల్లు చేరు కున్నారు...'' వాకిట్లోనే ఎదురై అంది సునీత.

నిష్టూరంగా మాట్లాడకు సునీ! — నీ బర్తుడేకదాని ఆఫీ సులో పనివున్నా సగంలో వదిలేసి మరీ వచ్చాను..." పాకెట్ చేతికందించాడు.

పేకెట్ విప్పి చూచింది.

''సునీ! — చీరె బావుందా —"

బాగుందో లేదోకూడా చెప్పకుండానే మేడమీదికి వెళ్ళి పోయింది, తల్లి పిలుపు విన్పించగానే.

రాను రానూ సునీతలో చోటుచేసుకుంటున్న మార్పుకు కారణం పసికట్టలేక పోతున్నాడు సీతాపతి.

రోజులు గడుస్తున్నకొద్దీ తనపట్ల సునీతలో నిర్లక్ష్య భావం కన్పించటం... సీతాపతి గమనించక పోలేదు.

ఆస్తీ, ఐశ్వర్యం వుందికదానే అహంభావం అటు అత్త గారిలోనే కాదు...ఇటు సునీతలోకూడా వూపిరి పోసుకోవటం కొత్తగా అన్పిస్తోంది.

అప్పటికే ఆరుగంటలు దాటింది.

స్నేహితులతో, అతిథులతో ఇల్లంతా కోలాహలంగా వుంది.

సీతాపతి డ్రెస్ చేసుకుని, హాల్లోకొచ్చాడు.

మల్లెపూల జడవేసుకుని వంటినిండా సొమ్ములు అలంక రించుకుని మేడమెట్లు దిగివస్తున్న సునీతనిచూస్తూ, తననుతాను మర్చిపోయేడు సీతాపతి.

'సునీ...ఇద్దరు పిల్లల తల్లిలా లేనేలేదు...' అనుకున్నాడు. పెళ్ళిరోజునాటి అందం మళ్ళీ తిరిగి సునీతలో ఇప్పుడు చూస్తు న్నాడు.

గ్రీట్ చేద్దామని దగ్గరకు వెళ్ళిన వాడల్లా తక్షణ ఆగి పోయాడు.

సీతాపతి ముఖంలో రంగులు మారేయి. మనిషి నిర్విణ్ణు డయ్యాడు.

అమ్మకొన్న పట్టుచీరె కట్టుకుంది... ప్రేమతో అభిమానంతో తాను తెచ్చిన వాయిలు చీరెకంటే ... పట్టుచీరే ఖరీదెక్కువ—బహుశ అందుకే కట్టుకోలేదేమో?

కనీసం తన తృప్తికోసమైనా కట్టుకుని వుండాల్సింది!—అలా జరగనందుకు తనమీద తనకే అసహ్యం పుట్టుకొచ్చింది, సీతాపతికి.

గబగబా అడుగులు వేసుకుంటూ బైటికెళ్ళి పోయాడు.

*　　　*　　　*

"సునీతా! నేనీ ఇంట్లో ఒక్క క్షణంకూడా వుండదల్చుకోలేదు. ఎన్ని అవమానాలు జరుగుతున్నా ఇన్నాళ్ళూ భరిస్తూ వచ్చాను. పరిస్థితులకు లొంగి, ఆత్మాభిమానాన్ని చంపుకుని బ్రతకటం నాకిష్టంలేదు..." మనసులో వుద్దేశాన్ని నిక్కచ్చిగా చెప్పేడు సీతాపతి.

"ఇప్పుడు మీకేం తక్కువైందీ?—

"నాకీ ఇంట్లో గౌరవం బొత్తిగా లేదు. నన్ను ప్రేమించని, అభిమానించని మనుష్యుల మధ్య వుండలేను. మనం ప్రేమించి పెళ్ళి చేసుకున్నాం! నువ్వు నన్ను సరిగ్గా అర్థం చేసుకున్నా...నీవంటే ఏమిటో నేను తర్వాత తర్వాత తెలుసుకో గలిగాను..."

"అనవసరంగా బాధపడతా రెందుకూ? మా స్థాయికీ, హోదాకీ మీరు ఎదగలేక పోతున్నారు.... మీ ఆలోచన్లూ,

అలవాట్ల మేరకు నేను దిగజారలేక పోతున్నాను. లంతేకదూ?"

"అర్థం లేకుండా మాట్లాడకు— నీ డబ్బూ, గొప్పను చూచి నేను నిన్ను ప్రేమించలేదు. ఆ సంగతి నీకూ తెలుసు! నా మంచితనాన్ని అలుసుగా తీసుకొని నువ్వు మాట్లాడటం, మీ అమ్మ మితిమీరి ప్రవర్తించటం నాకు గిట్టదు-నేను సహించను! అందుకే నేనొక నిర్ణయానికొచ్చాను..."

నిర్ణయ మేమిటని అడగలేదు సునీత! భర్త నిర్ణయం ఎలాంటిదో కూడా తాను ఊహించగలదు,

"ఈరోజునుంచీ మనమీ ఇంట్లో వుండద్దు. ఇంకా కొన్నాళ్ళు ఇక్కడే గనుక ఉంటే... అభిప్రాయభేదాలేకాదు మనిద్దరి మధ్యా అగాధాలు కూడా ఏర్పడతాయ్... అర్థమైందా?"

అంతవరకూ తలుపుచాటునేవుండి భార్యాభర్తల సంభాషణ వింటున్న అత్తగారు బెడ్ రూంలోకొస్తూ "అయితే... ఇంతకూ ఏమంటాడే మీ ఆయన?... వెళ్ళిపోతానంటాడా?-" కూతురును ద్దేశించి అంది.

"అవును! అయితే నేనొక్కడినే కాదు. నా భార్యా పిల్లల్ని కూడా తీసుకెళ్తానంటున్నాను. ఏం సునీతా! మాట్లాడవేం?—"

"అదేం మాట్లాడుతుంది-నేను చెప్తున్నా విను. నువ్వు సంపాదించే ముష్టి నాలుగొందల రూపాయలూ... నీ ఖర్చుకే,

నీ సరదాలకే సరిపోదు— ఇక నీ పెళ్ళాం పిల్లలు ఏంతింటారు నీతో వచ్చి?'' కటువుగా అంది సుభద్రమ్మ.

సీతాపతిలో అసహనం కట్టలు తెంచుకుంది. కోపంతో మనిషి వూగిపోతున్నాడు.

''ఉంటే తింటాం— లేకపోతే పస్తులుంటాం!! అందుకు సిద్ధపడే నన్ను పెళ్ళి చేసుకుంది సునీత...''

''నీతోపాటు అద్దెకొంపల్లో ఉంటూ, చింకి చీరెలు కట్టుకోవాల్సిన అగత్యం దానికేం పట్టలేదు...''

''అవునండీ...మనం బయటికెళ్తే... పిల్లల కాన్వెంటు చదువే కాదు, నా ఆరోగ్యంకూడా పాడవుతుంది ...కదూ?''

''సునీతా! తెలివి తక్కువగా మాట్లాడకు. మనం ఆశించింది వేరు ఇప్పుడు జరుగుతున్నది మరొకటి. నాకు ఆస్తి, ఐశ్వర్యం లేకపోవచ్చు. కానీ ఆత్మాభిమానం ఉంది. నన్ను గౌరవించలేని జీవిత భాగస్వామిని నేను ప్రేమించలేను...''

''ఏమండీ!- అభిమానం చంపుకునైనా బ్రతకవచ్చేమో గానీ...డబ్బు లేకపోతే బ్రతకలేమండీ...''

''సు...నీ...తా...''

చెంప చెళ్ళుమనటమే కాదు, సీతాపతి అరుపుకి గది దద్దరిల్లిపోయింది— కళ్ళు చింతనిప్పుల్లా మండుతున్నాయ్. కాళ్ళక్రింద భూమి బ్రద్దలవుతున్నట్టూ...అవమానంతో శరీరం ముక్కలు పడుతున్నట్టూ ఫీలవుతున్నాడు.

"నీ చేత నీతిపాఠాలు చెప్పించుకోవాల్సి రావటం నా దురదృష్టం!— నీకు మీ అమ్మా, ఆమె వెనుకనుండే ఆస్తీ, ఐశ్వర్యమే కావాలనుకుంటే నేనేమీ చెప్పలేను- కానీ మన బంధం దూరమైం తర్వాత...నీ నిర్ణయం సరైనది కాదని తర్వాత విచారించి ప్రయోజనం ఉండదు—"

రివ్వున గదిలోంచి బైటికెళ్ళి పోయాడు సీతాపతి.

సీతాపతి, శ్రీపతి ఇద్దరూ బార్లో కూర్చున్నారు.

అప్పటికే సీతాపతి రెండు రౌండ్లు లాగించేడు.

గ్లాసులో ఐస్ ముక్కలు వేసుకుంటూ "నేనూ, సునీతా విడిపోయాం - నేను ప్రస్తుతం అనూరాధ ఇంట్లో వుంటు న్నాను..." నిశ్చలంగా అన్నాడు సీతాపతి.

సీతాపతి నిర్ణయం విన్న తర్వాత ఒక్క క్షణం కూడా టేబిలు ముందుకూర్చుని, అతనితో కలిసి మందు కొట్టాలన్పిం చలేదు శ్రీపతికి.

శ్రీపతికి సీతాపతి రెండో ప్రాణం! తన హెచ్చరికనూ, మందలింపునూ సైతం స్నేహితుడు లెక్క చెయ్యనందుకు బాధ పడ్డాడు శ్రీపతి.

"ఎంత పాడుపని చేశావురా?— ఆత్మాభిమానం అంటూ...పరాయి పంచన చేరేవా? — వెరీ బేడ్! — తాగు!!—. పీకలదాకా తాగు!! ఈ మత్తులో, నిషాలో నీకేం చెప్పినా అర్థంకాదు" అనేసి కూర్చున్న వాడల్లా లేచి వెళ్ళి పోయాడు.

*   *   *

సంవత్సరాలు దొర్లిపోతున్నాయ్.

జీవితం వూహించని మలుపులెన్నో తిరుగుతూ ముందుకు సాగిపోతుంది.

వుత్తరాలు వ్రాసుకోవటం తప్ప... మళ్ళీ సీతాపతిని కల్సుకునే అవకాశమే కలుగలేదు శ్రీపతికి.

శ్రీపతికి రిటైర్మెంటు దగ్గరపడ్డది.

ఒకరోజు ఆఫీసుకెళ్ళగానే టేబిలుమీదవున్న వుత్తరాన్ని చూచి చించి చదివేడు.

డియర్ పతీ!

జీవితంలో అన్నీ పోగొట్టుకున్నా...... ఇంకా బ్రతికే వున్నాను!

అనూరాధ చనిపోయింతర్వాత, నాదివంటరి బ్రతుకైంది.

నాప్రావిడెంటు ఫండంతా దానిపిల్లలకే ఇచ్చేశాను. ఇంకా నాకెందుకు డబ్బనుకున్నాను.

ఏమీ లేకపోయినా అన్నీవున్నాయనుకుంటూ బ్రతుకుతున్నాను.

నా రెండో కంటికికూడా 'శుక్లం' రాబోతూంది.

అప్పుడు పూర్తిగా గుడ్డివాడినై పోతానురా! కనీసం నీకు వుత్తరం రాసుకునే అవకాశంకూడా వుండదురా పతీ!

అందుకే... ఆపరేషన్ చేయించుకుని, కళ్ళు బాగు చేయించుకోవాలనుంది. ఇంకా బ్రతికి బావుకుందామని మాత్రం

కాదు, కంటికి చూపైనా వుంటే... నేను రాలిపోయేలోగా నిన్నొక్కసారి చూడాలని ఆశ! అంతే!

నీకు చేతనైతే ఓ వందరూపాయలు పంపించు — నీకు తిరిగిఇచ్చుకోలేకపోయినా, నీకు ఋణపడి మాత్రం వుంటాను.

నీ
సీతాపతి.

వుత్తరం చదివి కళ్లొత్తుకున్నాడు.

* * *

పంచపాళీలో లైటువేసింది కామేశ్వరమ్మ.

"ఏమండీ... ఈపూటైనా ఎంగిలిపడరూ..." శ్రీపతిని తట్టిలేపింది.

ఆలోచనా నిద్రనుంచి మేలుకుని పెద్దనిట్టూర్పు విడిచాడు శ్రీపతి.

(డిసంబరు 77 స్నేహమాసపత్రిక)

*WITH THE BEST COMPLIMENTS*

*FROM*

**RELIABLE AUTO SERVICE STATION**

**GOVERNMENT WORK SHOP**

*( Recognised )*

*Prop*:- **Syed Sultan Mohideen.** **Kongareddipalli,**
**CHITTOOR (A. P.)**